# కొబ్బరి బోండాం

– గుజ్జుల వెంకటకృష్ణారెడ్డి

"బొండం బొండం. కొబ్బరిబొండాం, ఓ... వట్నంబాబూ! ఇటు రండి అప్పుడే బస్సు దిగిన మోహన్‌కి ఎదురైన పిలుపు.

అందమైన ఆ పిలుపుకి దాహం దానంతటదే పుట్టుకొచ్చి కదలబోయాడు.

ఈసారి మరోవైపు నుండి పిలుపు "బాబు, పెద్ద పెద్ద బొండాలు. ఇట్టే దాహం తీరుతుంది. ఇటురండి బాబు" మధురమైన కంఠస్వరం.

అరనిమిషం అందాల్ని తిలకిస్తు వుండిపోయాడు.

అబ్బాయి ఆలోచనల్లో పడ్డాడని గమనించిన ఆ సుందరాంగులు చెరోవైపు నుండి "తియ్యని బొండాలు బాబు, నావి పెద్ద బొండాలు బాబు!" అంటు మొదలెట్టాడు.

అయోమయం నుండి తేరుకున్న మోహన్.... ఒక నిర్ణయానికొచ్చి, "చెరో బొండం ఇవ్వండి తాగుతాను" అన్నాడు.

ఆనందంగా అందించారు వాళ్ళు.

"స్ట్రా లేదా..." అడిగాడు మోహన్.

ఇక్కడంతా డైరెక్టేండి. ఎత్తిపట్టుకుని గుటక లేస్తు తాగాలి.

ముద్దుగుమ్మల జవాబుకి మురిసిపోతు, ఒకటి తరువాతొకటి గుటకలేస్తు లాగించాడు మోహన్. "బొండాలు పెద్దగావున్న నీళ్ళు మాత్రం తక్కువే," ఇద్దరివంక ఓరకంట చూస్తూ వ్యంగ్యంగా అన్నాడు మోహన్.

"మరేనండి. ఇవి చిన్నాపురం బొండాలండి. అవే పెద్దాపురం బొండాలవుతే చూపుకిచిన్నవే అయిన, దాహం బాగా తీరుతుందండి అన్నారు ఆడంగులు.

సరసమైన సమాధానానికి ఇంకా ఏదో... అడగాలనివున్నా సాహసించలేక సాగిపోయాడు మోహన్.

పడుచు పిల్లలు, పచ్చని చెట్లు, దారివెంట చక్కిలిగిలి పెట్టె పైరగాలి. ఆహా! ఎంత ఆహ్లాదకరమైన వాతావరణం. పట్నం కాలుష్య వాతావరణంలో పెరిగిన మోహన్ పల్లెటూరి ప్రశాంతతకి పరవశించిపోయాడు. మేనమామ కోరిక కాదనలేక వచ్చాడేగాని, వచ్చినందుకు మహా సరదాగా వుంది. పొలంగట్లపై నడుస్తు ఇరుప్రక్కల ఇంపైన యువతులు వంగి వంగి నాట్లేస్తుంటే కోరికలకు కళ్ళెం బిగించలేకపోతున్నాడు. ఉషారుగా ఇల్లు చేరేసరికి వాకిట్లో ముగ్గులేసే వనజ, జారిన పైటను చూసి గుటకలేశాడు.

మోహన్ అలికిడికి జారిన పైటను జాగ్రత్తగా కట్టుకుని, "ఇదేనా బావా రావడం" అంటూ ఆరాటంగా సూట్‌కేస్ అందుకుంది వనజ.

లేత బెండకాయవంటి ఆమె వేళ్ళ తాకిడికి మోహన్ నరనరాల్లో కరంటు ప్రాకింది.

వనజ రంగు నలుపే అయిన భారీ అంగ సౌష్టవం. ఆమెలో కిన్నెర వంపులు, ఎంకి కులుకులున్నవి. "ఏరా! ఇదేనా రావడం?" అన్న సింహగర్జనలాంటి మేనమామ పలకరింపుకి ఈ లోకంలోకొచ్చి "అవును మామయ్యా!" అంటూ పిల్లిలా ఇంట్లోకి దూరాడు.

మోహన్ వచ్చి రెండు రోజులయింది. వరసైన వనజ సరసనేవున్నా కోరిక తీరడం లేదు. మామయ్య ఎక్కడికీ కదలకపోవడంతో అదును చిక్కక మథనపడ్తున్నాడు మోహన్. ఆ మరునాడు పొరుగూరులో వనుండి మావయ్య ప్రొద్దుటే బయలుదేరుతూ "ఒరే మోహన్ ఏమీ తోచకపోతే అలా మన పొలం వరకు వెళ్ళిరా, వనజను తోడుగా తీసుకెళ్ళు" అన్నాడు.

"లలలాం లలలాం లక్కీ ఛాన్సులే" అంటు కూనిరాగాలు తీస్తు, "వనజ ఈతకొట్టి చాలా రోజులైంది బావి చూపిద్దువుగాని అలాపొలం వంకు వెళ్ళొద్దాం పద" అంటున్న మోహన్‌తో, పొలంగట్లు చూస్తే పర్వాలేదుగాని, కొత్త బావి దరి బాగాలేదు బావా, ఈదడం కష్టం. జారిపడతావు ఆపై నీ ఇష్టం అంటునే మోహన్‌తో పొలానికి బయలుదేరింది వనజ.

చిలిపిగా సాగుతుంది ఇద్దరి ప్రయాణం. ఆ అజంతా చిత్రసుందరివంపులకు, నడకలోని ఆ లయకు మదిని పులకించిపోతూ, ఆమె మన్మథ సామ్రాజ్యాన్ని ఏలేద్దామన్న తొందరలో మధ్య, మధ్యలో అలవోకగా వనజను రాసుకుంటు, తోసుకుంటు నడుస్తున్నాడు మోహన్.

"అలా తొయ్యకు బావా, బురదలోకి జారిపడతాను" అంటూ ఆగిపోయింది వనజ.

ఆ మాటలకి మోహన్‌లో కోరికరెట్టింపైంది.

చిగురు వేసుకుంటున్న చింత చెట్టుక్రింద నులకమంచం చూసి వనజను గట్టిగా కౌగిలించుకున్నాడు. "వద్దు బావా, వదులు" అంటున్నా ఆమె పెదవులపై ముద్రవెయ్యబోతున్న మోహన్‌ని గట్టిగా విధిలించుకుని, "ఏంటి బావా పెళ్ళైన నన్ను, ఇలా చెయ్యడం... ఎవరైనా చూస్తే? నీకేంటి మగమహారాజువి, కూలేది నా కొంప. అయినా! మా నాన్న నన్ను చేసుకొంటే, నల్లగా వున్నానని వద్దన్నవాడివి ఇప్పుడిలా?... అంటూ వుండగా.

"ఎంతసేపైంది వచ్చి? మోహన్‌తో కలిసి పొలానికి వెళ్ళావని పక్కింటి పార్వతమ్మ చెప్పింది. ఏం మోహన్ బాగున్నావా?" అంటు అక్కడికి వచ్చిన వనజ భర్త రాజారావును చూసి గుండెలో రాయిపడ్డట్టయి. "ఇప్పుడే వచ్చాం," తడబడుతు సమాధానమిచ్చాడు, మోహన్. భయాన్ని కప్పిపుచ్చుతూ, "పదండి భోంచేద్దురుగాని అంటు బయలుదేరింది వనజ.

రాజారావుతో ఫ్రీగా ఉండలేకపోయాడు మోహన్. నాన్నగారు వచ్చేవరకు ఉండమంటున్న వనజ మాట లెక్క చెయ్యక సాయంత్రం బస్సుకు బయలుదేరాడు.

ఆలోచనల్ని ఉసిగొల్పే సిగరెట్టు దమ్ములాగుతూ బస్సు స్టాండ్‌కి చేరాడు.




దాహం తీర్చుకోండి బాబు దాహం... అంటు కొబ్బరిబోండాం అమ్మేవాళ్ళ గోల. ఓ అందమైన అమ్మాయి షాపుకేసి నడిచాడు మోహన్.

"బాబూ! చిన్నాపురం బోండం కావాలా లేక పెద్దాపురం బోం....డాం... కావాలా?" అడిగింది షాపులోని అమ్మాయి. "లేత కొబ్బరున్న బోండం కావాలి" అన్నాడు మోహన్.

"అయితే లోపలికి రండి బాబు. పూర్తిగా దాహం తీర్చుకుందురుగాని" అంటున్న ఆమెవంక ఆదోలా చూస్తూ, అనుసరించాడు మోహన్.

నిగనిగలాడే నవయవ్వనంలోని కుందనపు బొమ్మను చూసి కోరిక బుసలు కొట్టింది, మోహన్‌లో. "మా చెల్లెలండి, ఊరెళ్ళి నిన్నే వచ్చింది. లేత కొబ్బరి. మీరు దాహం తీర్చుకోండి బాబు. నే కొట్టు చూసుకోవాలి," అంటు బయటకు నడిచిందామె.

ఊహించని ఆ సుఖానికి ఉక్కిరిబిక్కిరవుతూ దాహం తీర్చిన లేత కొబ్బరిబోండానికి ముచ్చటగా మూడొందలిచ్చి బయటకి వస్తున్న మోహన్ ఒక్కక్షణం నిర్ఘాంతపోయాడు.

అదోరకంగా నవ్వుతూ, "ఏం బ్రదర్ కొబ్బరిబోండాలెలావున్నాయి" అంటున్న రాజారావుని చూసి.

"మీరు... ఇక్కడా!" ఆశ్చర్యంగా అడిగాడు మోహన్.

"అవును బ్రదర్! సాయంకాలం లేత బోండాం అయితేనే రుచిస్తుంది నాకు!"

అజంతా చిత్రసుందరిలాంటి వనజ వుండగా? ఈయనకి ఇదేం బుద్ధి. పాపం వనజకి ఈ విషయం తెలియదా? తెలిసినా అలా... అయినా మగవాళ్ళు చేస్తే అది వెరైటీకోసం, అదే ఆడవాళ్ళు చేస్తే 'పతిత' అన్న ముద్రవేసి సమాజం ఆమె కాపురం కూల్చడం కాయం ఇదెక్కడి న్యాయం అంటే పట్టించుకునేవారేరి అందుకే అన్నారు కాబోలు మగమహారాజ లని... పరిపరివిధాల మోహన్ ఆలోచనలను ఛేదిస్తూ బొయ్‌మని హారన్ మోగించుకుంటు వచ్చింది బస్సు.

●